


"ప్రేమేగనక సంగీతంవల్ల వృద్ధయినట్లయితే, నాకు ఇంకా పాడి వినిపించండి—అంటు న్నాడురా పాపం! ఈ భగ్న ప్రేమికుడు" అన్నాడు ఆనందరావు, షేక్స్పియర్ నాటకంలోని మొదటి పేజీలో మొదటిలైను చదువుతూ, కుర్చీలో వెనక్కి చేరబడి వింటున్న కృష్ణావతారంతో.

హాస్టల్లో రాత్రి భోజనమయ్యాక, చదువు కోడానికి పుస్తకాలు తీసిన బి. ఏ. మొదటి సంవత్సరం విద్యార్థులు ఆనందరావు, కృష్ణావతారం. ఇద్దరూ చిన్నప్పటినుంచి కలసి మెలసి చదువుకుంటూ వచ్చిన వాళ్ళు. ప్రాణస్నేహితులు. కృష్ణావతారం ధనికుల కుటుంబంలోంచివచ్చాడు. అతని ప్రాపుతో చదువు కుంటున్న బీదకుర్రాడు ఆనందరావు.

ఆనందరావు చిన్నప్పటినుంచీ అన్ని క్లాసుల్లో ఫస్టుగా వచ్చాడు. అటువంటి తెలివిగల కుర్రాడితో జతగా చదువుకుంటే తమ కుర్రాడు కూడా బాగా వృద్ధిలోకి వస్తాడనే ఆశతో రామస్వామిగారు తమ పుత్రుడైన కృష్ణావతారంతోబాటు ఆనంద రావుని కూడా అన్ని ఖర్చులు తామే భరించి చదివిస్తు న్నారు.

కాలేజీ హాస్టల్లో ఇద్దరూ కలిసి ఒక రూములో వుంటున్నారు. కృష్ణావతారం అంటే ఆనందరావుకి ఎంతో అభిమానం. అతనివలననే తాను ఈనాడు బి. ఏ. చదవగల్గుతున్నాడు. అతని మంచి చెడ్డల బాధ్యత లన్నీ రామస్వామిగారు తనపైన వేశారు. ఎందుకంటే కృష్ణావతారం ముద్దుగా, సుకుమారంగా పెరిగిన ధనవంతుల బిడ్డ. కష్టనష్టాలు ఎక్కు వగా తెలియవు. అందువల్ల అన్ని విషయాల్లోనూ ఆనందరావు అతన్ని సరిదిద్దుకోవాలని ఆయన చెప్పారు.

షేక్స్పియర్ డ్రామా 'ట్వల్ఫ్త్ నైట్'ని చదవడానికి తీసి మొదలెట్టగానే కృష్ణావతారం చాలా విస్పృహగా నిట్టూర్చాడు. ఆనందరావు, అది గమ నించి "ఏం బ్రదర్ నిద్రొస్తోందా? ఇవాళ వంట వాడు సాంబారు చాలా బాగా పెట్టేడులే! దోసు బాగా ఎక్కువ చేశావు కాబోలు. నిద్ర వస్తోంది" అన్నాడు.

"నిద్ర కాదురా బాబూ! నా మనస్సేం బాగు లేదు"

"అయితే ఫరవాలేదు. షేక్స్పియర్ యొక్క అత్యంత రమణీయమైన ఈ నాటకం మనం చద వడం ప్రారంభించామంటే మనస్సులోవున్న ఖేద మంతా మోదంగా మారిపోతుంది"

"అలా మారటల్లేదు సరికదా, విషాదం ఎక్కు వయిపోతోంది"

"ఏమిట్రోయ్ విశేషం?"

"సంగీతంవల్ల ప్రేమ వృద్ధవుతుందని—ఎంత అనుభవంతో వ్రాసాడురా?"

"ఎవడికిరా అనుభవం. నీకా? షేక్స్పియర్కా?"

"ప్రస్తుతంలో నాకేరా"

"చంపావు పో! అయితే నువ్వు ప్రేమించిన—లేక ప్రేమించబోతున్న ఈ —లిస్టు నెంబరు ప్రకారం-ఇరవై మూడో రాచకన్య నామధేయం చెద్దూ? ఆమె రాచకన్యయా, గోపికయా, మాతంగ కన్యయా, నాగకన్యకయా, ఎవరో సెలవిమ్మా"

"ఒరేయ్! ఇమాటు సీరియస్గా ప్రేమిస్తున్నాను రా"



కవిత్వంలో పడికొట్టుకుంటున్న కృష్ణావతారానికి ప్రేమ ఏమి తెలుసు? ఆ విషయం కమల చెప్పాలిగాని...

"నువ్వు 'సీరియస్'గా ప్రేమించని దెప్పుడు? మనఊళ్ళో రత్తి మొదలుకొని మా మేనమావ కూతుళ్ళు నలుగుర్నీ, హోటళ్ళలో, ట్రైనులో, బస్సులలో కన్పించి, నీ మనస్సును దొంగలించిన సుజాతా, పద్మినీ, సుకుమారి, మనోరమా, శారదా, ఇత్యాది కన్యలందర్నీ నువ్వు సీరియస్‌గానే ప్రేమించావు కదురా?"

"ఉష్! ఊరుకో. వాళ్ళందరి పేర్లూ ఎత్తకు. వాళ్ళకి ప్రేమంటే ఏమిటో తెలియదు. ఇప్పుడు నే ప్రేమిస్తున్న అమ్మాయిముందు వాళ్ళు ఆమె కాలిగోటికైనా పనికిరారు"

"సరే బాగానేవుంది. ప్రస్తుతం నీ ప్రేమ కథ ఆపి షేక్స్పియర్ డ్రామా ఆరంభిద్దాం. తొందరలో 'క్వార్టర్లీ ఎక్జామ్స్' వస్తున్నాయి"

"ఎల్లారా? వాడు ప్రేమా, సంగీతం అంటూంటే ఆ అమ్మాయీ, ఆమె సుందరవదనం జ్ఞాపకమొస్తోంది"

"పోనీ. ఫిజిక్సు చదువుదామా? అందులో 'ప్రెషరూ' 'టెంపరేచరూ'గురించి చదివితే—నాన్నగారూ, పేంబ్బెత్తం—జ్ఞాపక మొస్తుందా?"

"లాభం లేదురా. నా మనస్సు "దిగిరాను, దిగిరాను దివినుండి భువికి" అంటోందిరా."

ఆనందరావు చిన్న చిరునవ్వు నవ్వి "ఇంతకీ ఏమిటి కథ? కమలేనా?" అన్నాడు మిత్రుడువేపు చూసి.

"హార్నీ! ఎలా కనిపెట్టేశావురా?"

"మరింకెవరు బ్రదర్! కాలేజీలో అమ్మాయిలందరికన్నా అందమైన పిల్ల. బాగా పాడుతుంది. ఆమె యిప్పుడు అపూర్వచింతామణిలా ప్రశ్నలు వెయ్యడం మొదలెడ్తే, వెయ్యి బుర్రలుతెగి ఆమె కాళ్ళమీద పడడానికి సిద్ధంగా వున్నాయి."

"నిజమేరా. ఆమెను చూచిన వాడల్లా ఆమెను ప్రేమిస్తాడు."

"అలా అనకు. నాకా అమ్మాయిలో గొప్పతనమేమీ కన్పించలేదు."

"నువ్వో 'బుక్‌వరమ్'వి. నీకు సౌందర్యారాధన ఏం తెలుసు? మొన్న 'ఇండిపెండెన్సు'డే నాడు ఆమె పాడుతూంటే నేను విని మూర్ఛపోయే వనుకో. ఆ జయదేవుడి అష్టపది. "సావిరహేతవ దీనా రాధా" అని ఆ అమ్మాయి పాడుతూంటే ఆ గానంలో మైమరచి తన్మయత్వంతో నా హృదయమే ఆమె కర్పించాను."

"మంచిపని చేశావు. హృదయం ఇచ్చేస్తే ఇచ్చేశావు. మెదడు భద్రంగా వుందికదా! దానికి పని కల్పించి, కాస్త చదువు ధోరణిలో పడు"

"ఉహూ! కమల సంగతేదో తేలాల్సిందే." అంతవరకూ ఒక మెదడేకాదు, మన ఇంద్రియాలేవి పని చేయవు"

ఆనందరావు కృష్ణావతారంచేత అవాళ్టికి చదివించడం కష్టమని గ్రహించాడు. కృష్ణావతారం సౌందర్య పిపాసి. కవిత్వం రాస్తాడు. అందమైన ఆడది కన్పిస్తే ప్రేమిస్తాడు. అయితే ఆ ప్రేమ మరో అందమైన ఆడది కన్పించేవరకే. తరువాత కొత్తమ్మాయి మీదకు మారిపోతుంది. తన ప్రేమ గాధ లన్నిటినీ ఆనందరావుతో చెప్తాడు.

# హృదయలాస్యం

పేద కుటుంబంలోంచి సహజ ప్రతిభవల్ల పైకి వస్తున్న ఆనందరావు ఇలాటి విషయాలలో జోక్యం కలుగజేసుకోకపోవడమేకాక, మిత్రుణ్ణి సానుభూతితో మందలిద్దామని ప్రయత్నిస్తూంటాడు. ప్రేమించడానికి, ముందు ముందు కావలసినంత కాలముందనీ, కళాశాల చదువుని అశ్రద్ధ చేయవద్దనీ హెచ్చరిస్తూంటాడు.

కృష్ణావతారం ధనికుల బిడ్డ అవటంవల్ల, చదువుకోడం తనకు విజ్ఞానార్జనకొరకేగాని, జీవనార్జనకు గాదని, అందువల్ల తన సౌందర్యారాధనకు చదువు అడ్డం కాకూడదని తీర్మానించుకొన్నాడు.

రోజూ కారులో వస్తూండే కమలకోసం, కాలేజీ గేటు దగ్గరే సూటు వేసుకొని ఎదురు చూస్తూం డేవాడు. ఆమె రాగానే చిరునవ్వుతో ఆమెను తనవైపు ఆకర్షించాలనీ, ఎలాంటి అవకాశం దొరికినా ఆమెను పలకరిద్దామనీ ప్రయత్నించేవాడు. కమల అనలతనివైపే చూడకపోగా, ఇతర మగ విద్యార్థులు

---

ఆఫీసరు:-(గుమాస్తాతో) ఏమయ్యా పనిలోకి యింత ఆలస్యంగా వచ్చావు?

గుమాస్తా:-నిద్రలో మెలకువ రాలేదండి.

ఆఫీసరు:-ఏమిటీ? అయితే నువ్వింట్లో కూడా నిద్రపోతా వన్నమాట!

డి. ఎజ్, శంకర్

---

ఆమె దృష్టి నాకర్షించాలని ప్రయత్నించే—వారెవరి వంక కన్నెత్తి చూసేదికాదు.

కమల ఆ ఊళ్ళో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్మూర్తిగారి ఏకైకపుత్రిక. ఆ ఏడాదే ఇంటర్మీడియట్‌లో చేరింది. పదహారేళ్ళ మిసిమి జవ్వనంతో ఆమె సౌందర్యం, నవవికసిత కుసుమంలా చూసేవారికి మనో మోహనజనకంగా వుండేది. కాలేజీ విద్యార్థులంతా—ఆమెను చూడడంకోసం విరగబడిపోయేవారు. ఆమె సెక్షనులో విద్యార్థులకు లెక్చరర్ల పాఠం వినటం కన్నా, ఆమె కట్టిన చీర, పెట్టుకున్న పువ్వులు, వేసుకున్న జోళ్ళూ పరీక్షించడంలో శ్రద్ధ ఎక్కువగా వుండేది. తక్కిన విద్యార్థినులు కూడా ఆమెతో పరిచయాన్ని వాంఛిస్తూ, ఆమెను ఎంతో గౌరవంగా చూసేవారు.

అందంవున్న ఆడదానికి సులభంగా నాయకత్వం లభిస్తుంది. డబ్బూ, బలంవున్న అబ్బాయి మగవాళ్ళలో నాయకుడవడం ఏమాత్రం కష్టంగాదు. మొత్తానికి చదువులో ప్రథములైన వాళ్ళు ఎక్కడోగాని నాయకత్వం వహించరు. స్టూడెంట్సు యూనియన్ పోటీలకు కృష్ణావతారం సిద్ధమయ్యాడు. అన్ని క్లాసులకూ వెళ్ళి కాన్వాసు చెయ్యడం ప్రారంభించాడు. ప్రక్కన ఆనందరావు వుండక తప్పదు.

అన్ని విషయాలూ ముందు ఆలోచించకుండా దిగడం కృష్ణావతారం పని. వాటిలోవున్న అవకతవక లన్నీ దిద్దడకు రావడం ఆనందరావు పని. సెక్రటరీ పదవికి నామినేషన్ ఇచ్చాక కృష్ణావతారానికి, తన ప్రత్యర్థి శ్రీరామ్ చాలా పలుకుబడిగల విద్యార్థి అనీ, గత రెండు సంవత్సరాలనుంచీ అంతర్ కళాశాలల వక్తృత్వ పోటీలలోనూ, నాటక పోటీలలోనూ ప్రథముడుగా రావటమే కాకుండా చదువులో కూడా తెలివైన వాడనీ లెక్చరర్లందరికీ ప్రీతిపాత్రుడనీ తెలిసింది.

ఆనందరావు ఈ విషయా లన్నీ తెలుసుకొని కృష్ణావతారాన్ని ఎలా గెలిపించాలా అన్న సమస్యలో పడ్డాడు. ఆ వూరు కాలేజీకి వాళ్ళు క్రొత్త. ఇంట ర్మీడియట్ వేరే ఊళ్ళో చదివి, బి. ఏ. కు ఇక్కడికి వచ్చారు. ఏ విద్యార్థి నోటివెంట చూసినా, శ్రీరామ్‌ని గురించిన పొగడ్తలే వినిపిస్తున్నాయి. కృష్ణావతారం ఎవరో, అతను ఎందుకు సెక్రటరీ పదవికి నిల్చున్నాడో ఎవరికీ తెలియదు.

ఎలక్షను ఇంక రెండురోజు లుందనగా, అందరూ శ్రీరామ్ విధిగా నెగ్గితీరతాడనీ, కృష్ణావతారాన్ని 'విత్‌డ్రా' చేసుకోమనీ చెప్పసాగారు. ఆనందరావు తన తెలివితేట లన్నీ ఉపయోగించి కృష్ణావతారాన్ని నెగ్గించాలనుకున్నాడు. అవాళ రాత్రి హాస్టల్లో స్పెషలుగా ఒక టీపార్టీ ఏర్పాటు చేయించాడు—కృష్ణావతారం ఖర్చుమీద. అందరూ ఎలక్షను ప్రచారంకోసం అనుకున్నారు. కాని ముందు కృష్ణావతారం చేత మంచి పాటలు నాలుగు పాడించాడు. హాస్టలు విద్యార్థులకు కృష్ణావతారం గాయకుడనీ, కవి అనీ అవాళే తెలిసింది. అందరూ సరదాగావున్న సమయంలో ఆనందరావు రెండే రెండు ముక్కలు చెప్పాడు. అందులో, హాస్టలు విద్యార్థి కాలేజీ సెక్రటరీ అయితేనే హాస్టలు గౌరవం నిలుస్తుందనీ, కాబట్టి హాస్టలు వాళ్ళంతా కృష్ణావతారానికి సహాయం చెయ్యాలనీ చెప్పాడు. శ్రీరామ్ హాస్టల్ విద్యార్థికాదు.

మర్నాడు ఆనందరావూ, కృష్ణావతారం ప్రతీ క్లాసులోని ప్రతి విద్యార్థితోనూ కృష్ణావతారానికి ఓటు వెయ్యమని అతి మర్యాదగా చెప్పారు. మధ్యాహ్నం లేడీస్ రూముకి బయల్దేరారు. కృష్ణావతారం మనసంతా కమలమీద వుంది. ఇన్నాళ్ళబట్టీ ఆమెతో మాట్లాడే అవకాశం లభిస్తే చాలునని ఎదురుచూసిన వాడల్లా, తీరా ఆమె నెదుర్కొని మాట్లాడవలసివస్తుందనేసరికి కొంచెం పిరికితనం పొందాడు. పైగా లేడీస్ రూముకు వెళ్ళగానే, అక్కడున్న మహిళల నందర్నీచూసి మరీ గాభరా పడ్డాడు. ఆనందరావు చొరవ తీసుకొని, అందరికీ కరపత్రాలిచ్చి కృష్ణావతారాన్ని పరిచయంచేసి, అతనికి ఓటు వెయ్యవలసిందని కోరాడు.

కృష్ణావతారం మనస్సు ఎక్కడో విహరిస్తోంది. కమలకోసం వెతుకుతున్న కళ్ళు కాస్సేపు శూన్యంలోకి ప్రయాణంచేసి వచ్చేటప్పటికి కమలా, ఆనందరావులకు జరుగుతున్న సంభాషణ విన్పించింది.

"ఇంతకుముందే మేమంతా, సరళాదేవి కోరిక



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

# హృదయలాస్యం

ప్రకారం శ్రీరావ్‌గారికి ఓటు చేద్దామనుకొన్నాం" అంది కమల.

"ఒకరి కోరిక ప్రకారం ఎందుకు వెయ్యాలి? మీ కిష్టమైతే వెయ్యండి. శ్రీరావ్‌కు మీరు మాటిచ్చారా?" అని అడిగాడు, ఆనందరావు.

"ఆయనతో మేమేమీ అనలేదు. కాని మాలో మేమే అనుకొన్నాం. ఆయన అసలు మా వద్దకు రాలేదు" అంది కమల.

"అక్కడే అతనికీ, కృష్ణావతారంకీ వున్న తేడా" అని ఆనంద్ చిరునవ్వు నవ్వి, కృష్ణావతారంవైపు చూశాడు. అప్పటికి కృష్ణావతారం తేరుకొని "నేనే ప్రప్రథమంగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను కాబట్టి నామాట మన్నిస్తారని విశ్వసిస్తున్నాను" అన్నాడు.

విద్యార్థినులంతా అతని తొట్రుపాటుచూసి నవ్వారు. ఆనందరావు తన సహజ వాగ్ధోరణితో వాళ్ళమధ్య సాన్నిహిత్యం సంపాదించాడు. మొత్తంమీద కృష్ణావతారంమీద వాళ్ళకు కొంత సానుభూతి కలిగింది. మరి కొంత సేపటికి శ్రీరావ్‌వచ్చి తనకు ఓటు వెయ్యవలసిందని అందర్నీ కోరినప్పుడు అందరూ తల లూపారు.

మర్నాడు ఎలక్షన్ జరిగినప్పుడు విద్యార్థినులు కృష్ణావతారంకే ఓటు చేశారు. అనుకోకుండా శ్రీరావ్‌మీద హెచ్చు మెజారిటీతో కృష్ణావతారం గెల్చాడు. ఆనందరావు తను పూనుకున్న పని అయిపోయిందికదా అని అని మళ్ళీ మామూలుగా తన చదువు ధోరణిలో పడ్డాడు.

కృష్ణావతారం సెక్రటరీ అయిన దగ్గర్నించి చదువు ధోరణి అసలే మానేశాడు. అతనికి కొంతమంది స్నేహితబృందం ఏర్పడింది. వాళ్ళ కాఫీ హోటలు ఖర్చులూ, సినిమా ఖర్చులూ అన్నీ అతనివే. హాస్టల్లో ఉన్నంతసేపూ వాళ్ళతో కాలం గడిపేవాడు. వాళ్ళెంతసేపూ కాలేజీలో చదువుతున్న ఆడపిల్లల్ని విమర్శించడం, లెక్చరర్స్ని ఆక్షేపించడం తప్ప, చదువుమీద ఏమాత్రం శ్రద్ధ చూపించేవారుకాదు.

కమలతో ఎలాగైనా పరిచయం చేసుకోవాలని చాలా ప్రయత్నాలు చేశాడు, కృష్ణావతారం. ఆమెను చూసినప్పుడల్లా అతనిలో ఆమెతో మాట్లాడాలని ఉత్సాహం కలిగేది, అతనికి. కాని ఆమె అతనికి ఏమాత్రం చనువివ్వకుండా తిరిగేది. ఆమె చాలా గర్విష్ఠిలా కన్పించేది. ఆమె దగ్గరనుంచి ప్రోత్సాహం లేకపోయేటప్పటికి ఎంతో ఆశతో ఆమెదగ్గరకు వెళ్ళినవాడల్లా, వెంటనే తిరిగి వచ్చేస్తూండేవాడు. అప్పుడప్పుడు మీటింగులు ఏర్పాటు చెయ్యవలసివచ్చినప్పుడు, కమల విద్యార్థినుల ప్రతినిధి కాబట్టి, ఆమెతో కలిసి మాట్లాడుతూండేవాడు. ఆ కాస్సేపూ అవసరమైన మాటలే మాటాడేది.

ఆమెతో తన హృదయవేదన చెప్పుకోవాలనీ, తన కవితాధారతో ఆమె సౌందర్యం వర్ణించి ఆమెకు విన్పించాలనీ, ఆమె పాటను మెచ్చుకోవాలనీ, కృష్ణావతారం ఎంతో ఉబలాటపడేవాడు. ఆమె మాత్రం అలాంటి వెర్రివెర్రి వేషాలు తన దగ్గర పనిచెయ్యవు

రీటా కేశ సమస్యలను తీర్చును



అతి త్వరలో

కుదుళ్లను బలపరచుటయే గాక, మనోహరమైన విడుపాటి నల్లని శిరోజములను పెంపొందించును. దీనిలో చేర్చిన ఔషధి సంపతివల్ల కేశములు ఊడిపోకుండగను, చుండ్రు లేకుండగను, నెరవకుండగను రీటా కాపాడగలదు.

రీటాను కొబ్బరినూనెలోగాని, మంచినూనెలోగాని కలిపి నిత్యం వాడండి. తప్పకుండా మీ కేశములు నల్లబడతాయి. దీనిని మీరు వాడి, మీ స్నేహితులకు కూడ సిఫార్సు చేయండి.



రీటా

అందమైన కేశ సంపదకు

రీటా కంపెనీ,
మద్రాసు-1

R-5TG

భోజనానికి వుండి పొమ్మనేది. కొందరిలో ఆ సహజమైన ఆత్మీయత వుంటుంది. వాళ్ళు మనస్సులో పైవాళ్ళేమనుకొంటారో అన్న శంకవుండదు. వారి మనస్సులాగే అందరి మనస్సూ సరళమైన దనుకుంటారు.

సరళతో స్నేహం అభివృద్ధయినకొద్దీ, కమల గురించిన ధ్యాస తగ్గిపోసాగింది కృష్ణావతారంకి. కాలేజీ వార్షికోత్సవం దగ్గర పడుతున్నకొద్దీ, ఉత్సాహంతో ఏర్పాట్లు చెయ్యనారంభించాడు. విద్యార్థులు ఒక ఇంగ్లీషు నాటకం వెయ్యదల్చుకున్నారు. విద్యార్థినులు కూడా ఒక డ్రామా వెయ్యదల్చుకున్నారు. సారస్వత పోటీలలో ఆనందరావుకి ఎక్కువ ప్రైజులు వచ్చాయి.

వార్షికోత్సవంనాడు కమల పాట కచ్చేరీ వుంటే చాలా బాగుంటుందని కృష్ణావతారానికి తోచింది. ఆమెను అడిగితే, ఆమె తానీ మధ్య ప్రాక్టీసు చెయ్యటం లేదనీ, అందుకని పాడలేనని చెప్పింది. కృష్ణావతారం ఎంత బతిమాలుకున్నా ఆమె వినలేదు.

ఆనందరావుతో ఈ విషయం చెబ్తూ, "ఈమె ఇంత అహంకారంగల మనిషి అనుకోలేదురా. ఎలాగైనా ఒక మంచి 'మ్యూజిక్ ప్రోగ్రాం' ఏర్పాటుచేసి ఆమెకు బుద్ధి చెప్తాను" అన్నాడు కృష్ణావతారం.

"అందుకే ఆడదాని వెనకాల పడగూడదురా—అని చెప్పాను. ఇప్పటికైనా నువ్వు దారిలోకి వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా వుంది." అన్నాడు ఆనందరావు, తన స్నేహితుడి ప్రేమఖాతాలో ఇరవైమూడో పద్దు ముగింపు కొచ్చిందన్న విషయం తెలుసుకొని.

"ఇంతకూ ప్రోగ్రాం ఎలా ఏర్పాటు చెయ్యాలా అని నేను బాధపడుతున్నాను" అన్నాడు కృష్ణావతారం ఓటమి నంగీకరిస్తూ.

"పోనీ కాలేజీలో ఇంకెవరైనా పాడ్తారేమో, కనుక్కొని వాళ్ళకు ఛాన్సియ్యి" అన్నాడు ఆలోచిస్తూ ఆనందరావు.

"అయితే ఆ ఏర్పాటు నువ్వు చెయ్యి. నేను ఇంకా బోలెడన్ని పనులు చూసుకోవాలి. రేపు సాయంకాలానికల్లా ఎవర్నో ఏర్పాటు చెయ్యి"

"సరే. ఆ విషయం నా కొదిలెయ్యి"

మర్నాడు ఆనందరావు, ఆడ పిల్లల్లో ఎవరైనా పాడ్తారేమో కనుక్కుందామని, లేడీస్ రూముకి వెళ్ళేటప్పటికి రూములో కమల ఒక్కర్తే వుంది. ఆమెను చూసి ఆనందరావు చిరునవ్వు నవ్వి, తిరిగి వెళ్ళిపోదామనుకుంటుంటే ఆమె "ఎవరు కావాలి మీకు?" అంది.

ఆనందరావుకి ఇష్టం లేకపోయినా మాట్లాడక తప్పలేదు. "అబ్బే లేడీస్ అంతా వున్నారేమో, ఒక విషయం అడుగుదామని వచ్చాను." ఇంతలో దూరంనుంచి వస్తున్న విద్యార్థినులు కన్పించారు.

కమల "ఆదివారం మీరు మా యింటి కొకసారి రావాలి. మా నాన్నగారు మీతో మాట్లాడతారుట" అని, విద్యార్థినులు వచ్చేలోపల తొందరగా అనేసి ఏమీ ఎరగనట్లు వూరుకొంది.

ఆనందరావు, ఆమెమాటకు జవాబు చెప్పకుండా, వచ్చిన విద్యార్థినులను మ్యూజిక్ ప్రోగ్రాం గురించి అడిగాడు. వాళ్ళెవరూ పాడడాని కిష్టపడలేదు. చివరకు ఆనందరావు, విద్యార్థులలో పాడేవాళ్ళచేతే ప్రోగ్రాం ఏర్పాటుచేద్దామని నిశ్చయించుకున్నాడు.

కమల తనను ఇంటికి ఆహ్వానించడంలో ఉద్దేశమేమిటో ఆనందరావుకి బోధపడలేదు. నిజంగా రామ్మూర్తిగారు తనతో మాట్లాడదలుచుకొన్నారా? తనతో ఆయనకు పనేమిటి? తను కాలేజీ పోటీలలో బాగా మాట్లాడానని అభినందించారు. ఆ అభిమానంకొద్దీ రమ్మన్నారేమో? అయినా పెద్దవాళ్ళు పిల్చినప్పుడు వెళ్ళకపోతే బాగుండదు.

ఆదివారం పదిగంటలకు ఆనందరావు కమల ఇంటికి వెళ్ళాడు. రామ్మూర్తిగారూ, కమలా ఆఫీసు గదిలో కూర్చొని వున్నారు. ఆనందరావు, ఆయన వద్దకు వెళ్ళి నమస్కరించాడు.

"రావోయ్ ఆనందరావు. నిన్ను మన యింటికి పిలవమని మా అమ్మాయితో చాలా సార్లు చెప్పాను. ఎప్పటి కప్పుడే మర్చిపోతున్నా ననేది. చాలా సంతోషం. మీదేవూరు?"

"మాది భీమవరం అండి. మేము ఎక్కువ ధనవంతులంకాము. అయి నా భగవంతుని దయవల్ల రామస్వామిగారనే ధనికులొకరు నన్ను చదివిస్తున్నారు. వారి అబ్బాయే కృష్ణావతారం. నా ప్రాణస్నేహితుడు" అని తనగురించి ఆయన అడగని వివరాలు కూడా చెప్పేశాడు ఆనందరావు.

---

నాటకం భలే జోరుగా జరుగుతోంది. ప్రేక్షకులుఎంతో శ్రద్ధగా చూస్తున్నారు. ఆ సన్నివేశం ఎంతో ఆకర్షణీయంగా వుంది. ప్రేక్షకులంతా "వన్సుమోర్!" అని పదేపదే అరవటం మొదలెట్టారు. ఆ హీరోకి కోపం వచ్చింది. ప్రేక్షకులకేసి కోపంగా చూస్తూ, "వన్సుమోర్!!" అని గట్టిగా అరిచాడు.

—అచ్చి రఘురామరెడ్డి (మద్రాసు)

---

"ఓ! అందుకా మీరు కృష్ణావతారంగారికి అన్ని విషయాలలోనూ 'సపోర్టు' చేస్తుంటారు?" అంది కమల.

"అవును"

"నీ భవిష్యత్తుగురించి నీ ఉద్దేశా లేమిటి?" అని అడిగారు రామ్మూర్తిగారు. కమలకూడా ఏమని జవాబిస్తాడో? అని అతనివైపు చూసింది.

"నే నింతవరకూ ఏమీ ఆలోచించలేదు" అన్నాడు ఆనందరావు.

రామ్మూర్తిగారు అతనిప్పటినుంచీ భవిష్యత్తు గురించి ఆలోచించి దానికి తగిన కృషిచెయ్యాలని చెప్పారు. ఒక లాయరు కాబోయేవాడు ఎలా దానికి తయారవ్వాలో వివరించారు. తన జీవితానుభవాల్ని చాలా చెప్పారు. మద్రాసులో తను లా చదివినప్పటి విషయాలు, గొప్పగొప్ప కేసులు జరుగుతున్నప్పుడు, ఆ లాయర్ల ఆర్గుమెంట్లు ఎంతో ఆసక్తితో చదివేవారమనీ, భాష్యంఅయ్యంగార్, రంగస్వామి మొదలైనవారి వాదాల్ని ఎంతో శ్రద్ధగా తెలుసుకొనేవారమనీ, లాయరు కాదగినవాడు ఎంతో కృషిచెయ్యాలనీ చెప్పుకొచ్చారు. జీవితంలో ప్రతి వ్యక్తికి ఉన్నతాశయా లుండాలనీ, వాటిని నెరవేర్చుకొనే పూనికా కృషి కూడా వుండాలని చెప్పారు.

ఆనందరావుకి ఆయన మాటలెంతో నచ్చాయి. ఆవాళ అతన్ని తమ ఇంట్లో భోంచెయ్యమని కోరింది కమల. ఆనందరావుమనస్సు ఉత్సాహంగా ఉండడంవల్ల అందు కంగీకరించాడు. చాలా గర్విష్టి, అహంభావంకలదీ అయిన కమల తన నెంతో ఆదరించి తనయందు స్నేహాన్నిచూపడం ఆనందరావు కెంతో ఆశ్చర్యం కలిగించింది. బహుశా తను కాలేజీలో చూపించిన ప్రతిభకు జరుగుతున్న గౌరవం అయివుంటుంది, ఇది వ్యక్తిగతమైన స్నేహం అయివుండదనుకొన్నాడు.

చివరికి ఆనందరావు ఎంతో స్నేహభావంతో రామ్మూర్తిగారింటినుంచి బయటికి వచ్చాడు. ప్రతి ఆదివారం వస్తుండమని అతన్ని రామ్మూర్తిగారు కోరారు.

కాలేజీ వార్షికోత్సవంరోజున కృష్ణావతారం సెక్రటరీ రిపోర్టు చదవడం అయ్యాక ప్రిన్సిపాలుగారు ఆ సంవత్సరం కాలేజీకి ప్రతిష్ఠ నార్జించిన విద్యార్థుల నభినందిస్తూ, కృష్ణావతారం కృషిని మెచ్చుకున్నారు. తరువాత ఆహ్వానితులైన రాజకీయనాయకు లొకరు ప్రత్యేకంగా ఉపన్యసించారు. ప్రైజు డిస్ట్రిబ్యూషన్ సమయంలో ఆనందరావు, కమలలదే పైచెయ్యి. వారిద్దరికి చాలా ప్రైజులు వచ్చాయి.

తరువాత మ్యూజిక్ ప్రోగ్రాం, డ్రామాలూ అయ్యేసరికి చాలా కాలమైపోయింది. కమలా రామ్మూర్తిగారూ కారులో వెళ్ళిపోయారు. విద్యార్థులంతా వెళ్ళిపోయాక ఆనందరావు తన ప్రైజులన్నీ మోసుకొని రూముకి వెళ్ళాడు. వాటిని బల్లమీద సర్దుతూంటే, అందులో ఒక పుస్తకంలో కవరొకటి కన్పించింది. ఇంతకుముందు లేకుండా ఇప్పుడెలా వచ్చిందా అని తెరచి చూసేసరికి అందులో "ఇన్ని బహుమతులతోపాటు నేనిచ్చే ఈ చిన్న బహుమతి కూడా స్వీకరించండి—అది నా హృదయం. అంతకన్నా నే నివ్వగలిగింది లేదు—కమల" అని వుంది.

ఆనందరావు ముందర ఆశ్చర్యపడ్డాడు. తన బహుమతుల్ని ఒకసారి చూస్తానని అడిగింది. అప్పుడీకవరు ఇందులో పెట్టివుంటుంది. కమల తనను ప్రేమిస్తుందని తను కలలోకూడా ఊహించలేదు. కృష్ణావతారం ఆమెకోసం ఎంతో తంటాలు పడ్డాడు. అతన్ని కాదంది. తను ఏనాడు ఆమెయందు ఆసక్తి చూపించలేదు. అయినా తనను కోరింది. ఇలా ఆలోచిస్తుంటే కృష్ణావతారం వచ్చాడు. "అయిపోయిందిరా. గొడవలన్నీ తీరిపోయాయి. ఇక శ్రద్ధగా చదువుకోవడమే తరువాయి" అన్నాడు.

"అవునురా. పరీక్షలు దగ్గర కొచ్చేసాయి. బాగా చదవాలి" అన్నాడు ఆనందరావు. కృష్ణావతారం బట్టలు మార్చుకోసాగాడు. బట్టలు మార్చుకుంటూ "ఒరేయ్! నువ్వు ఎన్నడూ కోరని అమ్మాయి, చాలా అందమైనదీ, మంచిదే అనుకో, హఠాత్తుగా నిన్ను ప్రేమిస్తే ఏం చేస్తావురా?" అని అడిగాడు.

"తప్పకుండా స్వీకరిస్తాను" అని పక్కమీదకి చేరాడు ఆనందరావు. ★